ఘనతంతా గతమేనా!

- నిద్రాణంగా జిల్లా ఒలింపిక్ సంఘం
- ఉమ్మడి జిల్లాలో ఎంతో ఖ్యాతి
- కార్యకలాపాలు లేక నిరాశలో క్రీడాకారులు



2023లో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు



2015వ సంవత్సరంలో చేపట్టిన ఒలింపిక్ రన్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): తూర్పుగోదావరి జిల్లా పేరు వింటే గుర్తుకు వచ్చేది క్రీడలు, కళలు. ఉమ్మడి రాష్ట్రంలో అతిపెద్ద జిల్లా తూర్పుగోదావరి. క్రీడల పరంగా కూడా అత్యధిక మౌలిక సదుపాయాలు కల్గిన జిల్లా. అటువంటి జిల్లాలో దాదాపు 30 ఏళ్ల క్రితం ఒలింపిక్ సంఘం ఏర్పాటయింది. సుమారు 26 క్రీడా సంఘాలకు ఒక తల్లిలా వ్యవహరిస్తూ క్రీడాసంఘాలన్నిటినీ ఒక తాటిపై నడిపిస్తూ జిల్లా క్రీడాభివృద్ధిలో తన వంతు పాత్ర పోషిస్తోంది. జిల్లాల పునర్విభజన అనంతరం రెండేళ్ల క్రితం కాకినాడ జిల్లాగా ఏర్పడినా ఆశించిన స్థాయిలో సంఘ కార్యకలాపాలు నిర్వహించకపోవడం క్రీడాభిమానుల్లో ఒకింత నిరాశ కలిగిస్తోంది. ఒలింపిక్ సంఘం తిరిగి తన పూర్వ వైభవాన్ని జిల్లాలో పొందాలని పలువురు క్రీడాసంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

ప్రారంభం ఇలా

ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు రాష్ట్ర ఒలింపిక్ సంఘం హైదరాబాద్ కేంద్రంగా పనిచేసేది. ప్రతి జిల్లా నుంచి కొంతమంది సభ్యులు సంఘం కార్యకలాపాలు సాగించేవారు. 1975లో ప్రారంభమైన జిల్లా ఒలింపిక్ సంఘానికి సుంకర భాస్కరరావు, మల్లికార్జునరావు, విశ్వేశ్వరరావు అప్పటి డీఎస్‌డీఓ రామ్మోహన్‌రావు ఆద్యులని జిల్లా వాసులు పేర్కొంటున్నారు. అప్పట్లో సంఘ కార్యకలాపాలు అంతంత మాత్రంగా ఉండేవి. 1987లో గోల్డ్‌స్పాట్ మూర్తి (ఎంవీవీఎస్ మూర్తి) రాష్ట్ర ఒలింపిక్ సంఘ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు జిల్లాకు చెందిన ఐడియల్ పీడీ కృపాదానం, పిఠాపురానికి చెందిన రత్నం (చంటి మాస్టారు), కె.పద్మనాభం, వైడీ రామరావు పూర్తిస్థాయిలో ఒలింపిక్ సంఘాన్ని పునరుద్ధరించారు. ప్రస్తుతం కాకినాడ జిల్లా ఒలింపిక్ సంఘంలో గుర్తింపు పొందిన క్రీడా సంఘాలు 23 ఉన్నాయి.

జిల్లా ఒలింపిక్ సంఘం ఇదే

కాకినాడ జిల్లా ఒలింపిక్ సంఘానికి చైర్మన్‌గా చుండ్రు గోవిందరాజు, అధ్యక్షుడిగా ద్వారంపూడి వీరభద్రారెడ్డి, ఉపాధ్యక్షులుగా పి.సతీష్, బి.అర్జునరావు, ఇన్‌చార్జి కార్యదర్శిగా జి.ఎలీషాబాబు, నిర్వహణ కార్యదర్శిగా వి.రవిరాజు, కొండపల్లి శ్రీనివాసరావు, కోశాధికారిగా కె.కొండలరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా కె.పట్టాభి, టీఎస్ సూర్యకుమారి, ఎంవీవీ దుర్గాప్రసాద్, జీజేఆర్‌ఎస్ కౌర్, వి.మాచరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చీఫ్ ప్యాట్రన్‌లుగా కర్రి భామిరెడ్డి, ప్రసాద్‌వర్మ నియమితులయ్యారు.

మినీ ఒలింపియాడ్‌కు రెండేళ్లుగా

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఒలింపిక్ సంఘం దాదాపు 24 ఏళ్లుగా మినీ ఒలింపియాడ్ పోటీలు నిర్వహిస్తూ 16 ఏళ్ల లోపు బాలబాలికలతో 13 క్రీడాంశాల్లో వారి క్రీడా ప్రతిభను నిరూపించుకోవడానికి ఒక వేదికగా నిలిచింది. కానీ రెండేళ్లుగా అటువంటి కార్యకలాపాలు లేకపోవడంలో క్రీడాకారులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

20 ఏళ్ల అనుబంధం



ఒలింపిక్ సంఘంతో 20 ఏళ్ల అనుబంధం ఉంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఒలింపిక్ సంఘం హయాంలో క్రీడాభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టాం. రెండేళ్లుగా జిల్లాలో ఒలింపిక్ సంఘ కార్యకలాపాలు ఆశించిన స్థాయిలో నిర్వహించకపోవడం వాస్తవమే. ఈ ఏడాది మినీ ఒలింపియాడ్, అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవాన్ని నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించాం.

– ఎలీషాబాబు, ఇన్‌చార్జి కార్యదర్శి, జిల్లా ఒలింపిక్ సంఘం, కాకినాడ

లీడర్‌షిప్ ఇనిస్టిట్యూట్‌కు రూ.3.5 లక్షల విరాళం



డాక్టర్ బాదం బాలకృష్ణకు రూ.3.5 లక్షలు చెక్కును అందజేస్తున్న సీతారాం

బాలాజీచెరువు: రాజమహేంద్రవరంలో నిర్మిస్తున్న లయన్స్ లీడర్‌షిప్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్‌కు ఇంపీరియల్ షిప్పింగ్ అధినేత కేపీఎస్ సీతారాం గురువారం రూ.3.5 లక్షల విరాళం అందజేశారు. ట్రస్ట్ చైర్మన్ బాదం బాలకృష్ణ మాట్లాడుతూ ఉమ్మడి లయన్స్‌క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో ఈ నెల 22న దీనిని ప్రారంభిస్తున్నామని, దీని ద్వారా యువతకు శిక్షణ ఇచ్చి వారిలో నైపుణ్యాలు పెంచడానికి కృషి చేస్తున్నామన్నారు. లయన్స్ క్లబ్ కాకినాడ, ఎలైట్ క్లబ్ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషమన్నారు. ట్రస్ట్ కార్యదర్శి మంజులూరి విశ్వేశ్వరరావు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఈఏపీ సెట్ ఉత్తీర్ణులకు అవగాహన సదస్సు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్లు

బోట్‌క్లబ్: ఈఏపీసెట్ పాసైన విద్యార్థులకు స్థానిక కుళాయిచెరువు ఆవరణలో ఉన్న ఫ్యాబిన్ కన్వెన్షన్‌లో కైట్ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఉచిత అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఇంటర్ పాసై ఎంసెట్‌లో ర్యాంకు సాధించిన విద్యార్థులు వారి తల్లితండ్రులతో ఈ అవగాహన సదస్సులో పాల్గొన్నారు. జేఎన్‌టీయూకే ప్రొఫెసర్ మురళీకృష్ణ విద్యార్థులకు ఇంజినీరింగ్ కోర్సులపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఏ కోర్స్ తీసుకుంటే సెటిల్ అవుతారో వివరించారు. ఇంజినీరింగ్ కోర్సులో సర్టిఫికేషన్ కోర్సుపై ప్రొఫెసర్ గోపీ అవగాహన కల్పించారు. విద్యార్థులకు పర్సనల్ డెవలప్‌మెంట్‌పై కొయంబత్తూరుకు చెందిన ప్రొఫెసర్ శిష్టా మూర్తి, విద్యార్థులు కెరియర్ డెవలప్‌మెంట్‌పై జాయ్, సత్య అవగాహన కల్పించారు. 20 రోజుల పాటు సదస్సు నిర్వహించనట్లు కైట్ విద్యాసంస్థల చైర్మన్ పోతుల విశ్వం తెలిపారు.

దేవస్థానం భూముల సాగుకు వేలం



వేలంపాటలో పాల్గొన్న అధికారులు, రైతులు

కరప: మండల పరిధిలోని కరప గ్రూపు దేవాదాయశాఖకు చెందిన పంట భూముల్లో మూడేళ్ల సాగుకు కరప, గొర్రిపూడి ఈఓలు కె.తిరుమలరవితేజ, ఎ.అపర్ణ గురువారం స్థానిక విష్ణాలయంలో బహిరంగ వేలం పాట నిర్వహించారు. కరప రామలింగేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించి 5 ప్రతులుగా ఉన్న 10.88 ఎకరాలకు వేలంపాట నిర్వహించగా ఐదుగురు రైతులు రూ 2.83 లక్షలు మగతా చెల్లించేందుకు పాడుకున్నట్టు ఈఓ తిరుమల రవితేజ తెలిపారు. గతంలో రూ.2,38,500కు పాడుకోగా ఈ ఏడాది రూ.43,500 అదనంగా వచ్చిందన్నారు. అలాగే చినమామిడాడలోని పంచముఖేశ్వర చైతన్య ట్రస్ట్‌కు చెందిన దేవస్థానం భూములు 9 ప్రతులుగా కరప, చినమామిడాడ, వేళంగి, యండమూరు గ్రామాల్లో ఉన్న 26.34 ఎకరాలకు వేలంపాట నిర్వహించగా 9 మంది రైతులు రూ.6,34,200కు పాడుకున్నట్టు ఈఓ తెలిపారు. గతంలో రూ.4,44,200కు పాడుకోగా ఈ ఏడాది రూ.1.9 లక్షలు అదనంగా వచ్చిందని అధికారులు తెలిపారు. దేవాదాయశాఖ సిబ్బంది చీర్ల శ్రీను, కె.రఘు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భీమేశ్వరునికి వైభవంగా శ్రీపుష్పయాగం



భీమేశ్వరస్వామికి శ్రీపుష్ప యాగ మహోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

బోట్‌క్లబ్: కల్యాణోత్సవాల్లో భాగంగా స్థానిక దేవాలయం వీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో గురువారం రాత్రి శ్రీపుష్పయాగ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కొడమంచలి కార్తిక్ ఆధ్వర్యంలో ఈ ఉత్సవం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను వివిధ రకాలు పుష్పాలతో ఎంతో అందంగా అలంకరించారు. ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వరరావు, భక్తులు స్వామి వారికి స్వీట్లు, వివిధ రకాలు పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వృద్ధాప్యంలో ప్రశాంతత అవసరం

కాకినాడ రూరల్: గతించిన జీవితం గురించి చింతించక వర్తమానంలో సంతోషంగా, ప్రశాంతంగా గడిపేందుకు కృషి చేయాలని ప్రాణిక్ హీలింగ్ వైద్యురాలు ఎం.వరలక్ష్మి పేర్కొన్నారు. రమణయ్యపేట బర్మాకాలనీ అంగన్వాడీ కేంద్రంలో ఆమె వృద్ధులకు పాదరక్షలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్, అంగన్వాడీ కార్యకర్త పరంజ్యోతి, సూర్య తదితరులు పాల్గొన్నారు.

విమాన ప్రమాదం బాధాకరం

బోట్‌క్లబ్: అహ్మదాబాద్ విమాన ప్రమాదం చాలా బాధాకరమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విమానం టేకాఫ్ అయిన కొద్ది సేపటిలోనే ఈ ప్రమాదం జరగడం చాలా దురదృష్టకరమన్నారు. ప్రమాదంలో చనిపోయిన వారికి ఆయన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

వచ్చే నెల 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కాకినాడ సిటీ: ప్రతి మాదిగ పల్లెలో జూలై 7వ తేదీన ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ సదస్సు, మందకృష్ణమాదిగ 60వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కాకినాడ జిల్లా ఇన్‌చార్జి సూరిపాక వాసుదేవరావు మాదిగ, కో–ఇన్‌చార్జి పసుపులేటి చిన్నబాబు మాదిగ, డాక్టర్ సుబ్బారావు మాదిగ పిలుపునిచ్చారు. గురువారం కాకినాడ 19వ వార్డు గోలీలపేటలో జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు పలివెల నవీన్ మాదిగ ఆధ్వర్యంలో జరిగిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల జిల్లా సమీక్ష సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నూతన కమిటీలను క్షేత్ర స్థాయిలో వేగవంతం చేద్దామన్నారు. జూలై 7న ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణలు గ్రామస్థాయిలో అన్ని సామాజిక వర్గాలతో విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ ఎంఎస్‌పీ, ఎంఎంఎస్ వార్డు కమిటీల అధ్యక్షులు, వర్కింగ్ ప్రెసిడెంట్, ఉపాధ్యక్షులు, కార్యదర్శి, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి, ప్రచార కార్యదర్శులను నియమించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు డోకుబుర్ర భద్రం, కాకాడ నూకరాజు, అనంతారపు రాజు, వల్లూరి సత్తిబాబు, చాట్ల ఆశీర్వాదం, పలివెల నవీన్, దూలపల్లి వెంకటరమణ, అడసార హరిబాబు, దేవర సురేష్, మిరియాల వీరబాబు, తాతపూడి దివాకర్, నరుకుర్తి రాజు తుమ్మలపల్లి చిన్న తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయితనానికి అంతేదీ!

- భీమేశ్వర ఆలయం ఎదుట ఫ్లెక్సీ
- టీడీపీ నాయకుల దుశ్చర్యపై భక్తుల ఆగ్రహం



భీమేశ్వర ఆలయం పక్కన ఈఓ కార్యాలయం కనిపించకుండా టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భంగా విజయోత్సవ ర్యాలీ నిర్వహించేందుకు నాయకులు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీ ఎక్కడో ఏర్పాటు చేస్తే పరవాలేదు. ఎంతో పురాతనమైన కాకినాడ దేవాలయంవీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయ ఈఓ కార్యాలయం ఎదురుగా పెట్టారు. ఆ మార్గంలో వెళ్లే ప్రజలు ఆలయం వచ్చేసరికి సహజంగా అటు తిరిగి భక్తితో ఓ నమస్కారం చేస్తుంటారు. ఈ నేపథ్యంలో పలువురు టీడీపీ ఫ్లెక్సీ వైపు తిరిగి అప్రయత్నంగానే నమస్కరిస్తూ తీరా అది టీడీపీ ఫ్లెక్సీ అని గుర్తించి తమ అపరాధానికి మన్నించు స్వామీ అని మనసులోనే వేడుకుంటున్నారు. టీడీపీ నాయకులు బచ్చు శేఖర్, అమన్‌జైన్, ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఉన్న ఫోటోల ఫ్లెక్సీ, టీడీపీ నాయకుడు పల్లా సురేష్ ఫొటోలతో ఉన్న ఫ్లెక్సీ ఆలయం ఎదురుగా ఏర్పాటు చేయడం చర్చనీయాంశమైంది. ఈ విషయమై ఈఓ రాపర్తి రాజేశ్వరరావు వివరణ కోరగా రాత్రికి రాత్రే ఎవరో వాటిని ఏర్పాటు చేశారని, వెంటనే తీసివేయాలని టీడీపీ నాయకులకు చెప్పినట్లు ఆయన తెలిపారు.

మహిళ కనిపిస్తే క్లిక్‌మనిపిస్తాడు!

- స్వీపర్ చేష్టలతో మహిళా ఉద్యోగుల అసహనం
- కరప పీహెచ్‌సీలో బధిరుడి శైలిపై ఆవేదన

కరప: స్థానిక పీహెచ్‌సీలో స్వీపర్ రాజాబాబు వ్యవహార శైలిపై మహిళా ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బధిరుడైన రాజాబాబు కరప పీహెచ్‌సీలో స్వీపర్‌గా పనిచేస్తున్నాడు. పీహెచ్‌సీలో పనిచేసే మహిళా ఉద్యోగుల ఫొటోలు తీస్తూ, వారిని మానసిక వేధిస్తున్నాడు. గురువారం గర్భవతి అయిన ఉద్యోగిని ఫొటోలు తీయడం వివాదాస్పదమైంది. తన ఫొటోలు ఎందుకు తీశావని యుడీసీ సమక్షంలో అడిగిన మహిళా ఉద్యోగిని కిందకు నెట్టివేయడంతో ఆమె కన్నీటి పర్యంతమైంది. ఫొటోలు తీయవద్దని ఎన్నిసార్లు చెప్పినా నిర్లక్ష్యంగా సమాధానం చెపుతున్నాడని, అతని ప్రవర్తనలో మార్పురావడం లేదని పీహెసీ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో అతను పెద్దాడ పీహెచ్‌సీలో కూడా ఇలాగే మహిళల ఫొటోలు తీసేవాడని, ఇక్కడకు వచ్చినా అలాగే వ్యవహరిస్తున్నాడని, ఈ విషయం తమను మానసిక వేదనకు గురిచేస్తోందని, స్వీపర్‌పై చర్యలు తీసుకోవాలని వారు స్థానిక విలేకరులకు వివరించారు. దీనిపై పీహెచ్‌సీ డాక్టర్ ఖతీజా సత్తారి అఫ్రోజ్‌ను వివరణ కోరగా ఇటీవలే ఇక్కడ బదిలీపై వచ్చానని, వారం రోజుల క్రితం ఇలాగే ఫొటోలు తీస్తున్నట్టు వచ్చిన ఫిర్యాదులపై అతనిని హెచ్చరించానని తెలిపారు. దీనిపై జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తామన్నారు.

• దుర్వాసన భరించాల్సిందేనా?



పీఆర్ కళాశాల రోడ్డులో అధ్వానంగా ఉన్న డంపర్‌బిన్‌లు

బోట్‌క్లబ్: నిత్యం వేలాదిమంది ప్రయాణించే రహదారిలో రోజుల తరబడి శుభ్రం చేయక వదిలేసిన డంపర్‌బిన్‌లు దుర్వాసన వెదజల్లుతూ అధ్వానంగా ఉన్నాయి. స్థానిక పీఆర్ కళాశాల రోడ్డులో ఏర్పాటు చేసిన ఈ బిన్‌లు నిండిపోయి దుర్వాసన వెదజల్లుతూ ప్రజలకు ఇబ్బందిగా మారినా కార్పొరేషన్ అధికారులలో చలనం లేదు. సత్వరం వీటిలో చెత్తను తరలించి శుభ్రం చేయాలని స్థానికులు, పీఆర్ కళాశాల వాకర్లు వాపోతున్నారు.

సామాజిక రుగ్మతగా బాల కార్మిక వ్యవస్థ

ఐసీడీఎస్ పీడీ విజయకుమారి



బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కుమారి విజయ కుమారి

కాకినాడ రూరల్: బాలల జీవితాన్ని, గౌరవాన్ని సర్వనాశనం చేసే సామాజిక రుగ్మతగా బాల కార్మికుల వ్యవస్థ కొనసాగుతోందని దీనిని అధిగమించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కుమారి కె.విజయ కుమారి పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రుల పేదరికం, నిరక్షరాస్యత వల్ల ఎందరో బాలలు కార్మికులుగా జీవిస్తున్నారన్నారు. కొన్ని సందర్భాలలో పెద్దలు చేయాల్సిన పనులను పిల్లలతో చేయిస్తున్నారని, అసలైన బాల్యం మాధుర్యాన్ని వారు ఆస్వాదించలేకపోతున్నారని అన్నారు. 14 ఏళ్లలోపు పిల్లలందరికీ ఉచిత నిర్బంధ విద్య అమలు చేయాలని పేర్కొన్నారు. ఆ దిశగా చిన్నారులను బడిలో చేర్చాలని విజయ కుమారి తెలిపారు. సీడీపీఓ వై.లక్ష్మి, జిల్లా బాలల సంక్షేమ అధికారి సీహెచ్ వెంకటరావు బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలన కోసం ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మార్తమ్మ, అడబాల రత్న ప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, బుద్ధరాజు సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు పుస్తకాల పంపిణీ

కాకినాడ రూరల్: స్థానిక రమణయ్యపేట ఐడీఏ ఆధ్వర్యంలో ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు పిల్లలకు పుస్తకాలు, సాక్స్‌లు అందచేసారు. కాకినాడ ఐడీఏ కార్యదర్శి డాక్టర్ అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా అవగాహన కల్పించడం, తద్వారా, దీనిని అంతం చేయడానికి, బాలలకు మంచి భవిష్యత్తును అందించడానికి సహాయపడవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐడీఏ సభ్యులు పాల్గొన్నారు.

బాలలతో చాకిరీ చట్టరీత్యా నేరం

- జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సెలర్ దుర్గారాణి
- బాలల హక్కులపై అవగాహన ర్యాలీ



మూలపేట పాఠశాలలో బాలలతో దుర్గారాణి తదితరులు

కొత్తపల్లి: బాలలతో పని చేయించడం, ఏదైనా పనిలో నియమించడం చట్టరీత్యా నేరమని, ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్ట ప్రకారం 14 ఏళ్లలోపు పిల్లలు బడిలో ఉండాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సెలర్ బి.దుర్గారాణి అన్నారు. మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ అధికారి కె.విజయ కుమారి ఆదేశాల మేరకు పిఠాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ దుర్గాదేవి ఆధ్వర్యంలో గురువారం మండలంలోని మూలపేటలో ఉన్న జిల్లా పరిషత్ పాఠశాలలో అంతర్జాతీయ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బాలల హక్కులపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గారాణి మాట్లాడుతూ బాల కార్మికులు ఉన్నారని తెలిసినట్టయితే 1098కి ఫోన్ చేసి సమాచారం అందించాలని ఆమె కోరారు. బాల బాలికలను చైతన్య వంతులుగా తీర్చిదిద్దడానికి కిశోరి వికాసం ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి కుటుంబం ఆర్థికంగా స్థిరపడడానికి ప్రయత్నం చేస్తున్నారు. ఎంత సంపాదించామన్నది కాకుండా ఎంత ఖర్చు చేస్తున్నాం, ఎంత పొదుపు చేస్తున్నాం అనే అంశంపై ప్రణాళిక ఉన్నట్లయితే సమాజంలో ఆర్థికంగా ఉన్నత స్థాయికి ఎదగడానికి అవకాశం ఉందన్నారు. సైబర్ నేరాలపై సమాచారం ఇవ్వడానికి 1930కి ఫోన్ చేయాలన్నారు. విద్య స్థిరమైన, సంతోషకరమైన జీవితానికి దోహదపడుతుందన్నారు. ఆర్థిక స్వాతంత్ర్యం అందిస్తుందన్నారు. అంతే కాకుండా తప్పొప్పులపై అవగాహన కలిగిస్తుందని ఆమె పేర్కొన్నారు. బాలలకు సంబంధించి ఎటువంటి సమస్యలు ఉన్నా 1098కు ఫోన్ చేసి సమాచరం అందించాలన్నారు. పిఠాపురం ప్రాజెక్ట్ విస్తరణాధికారి లలిత మాట్లాడుతూ 18 ఏళ్లు నిండకుండా అమ్మాయికి, 21 ఏళ్లు నిండకుండా అబ్బాయికి వివాహం చేస్తే బాల్య వివాహంగా పరిగణించి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని, వివాహం చేయగానికి ప్రోత్సహించిన వారందరికీ బాల్య వివాహ నిషేధిత చట్టం 2006 ప్రకారం శిక్ష విధించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ రూరల్ మండల సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు

ఎంపీడీఓ	పసుపులేటి సతీష్	98481 83847		
ఎంపీపీ	బందిలి వీరీష	88977 14834		
గ్రామం	ప్రత్యేక అధికారి/సర్పంచ్		కార్యదర్శి	
రమణయ్యపేట	కేఎస్ వరప్రసాద్	91544 09525	జె.నరసింహరావు	98483 33678
వాకలపూడి	కేఎస్ వరప్రసాద్	91544 09525	పి.పాండురంగారావు	98857 63592
వలసపాకల	జి.శ్రీనివాసరావు		ఆర్ఎస్ఎన్ మూర్తి	94404 11936
ఇంద్రపాలెం	ఎంఎస్ఆర్ ఆంజనేయులు	94921 60499	ఎం.శివప్రసాద్	98497 48720
చీడిగ	పసుపులేటి సతీష్	98481 83847	బి.గోవిందరాజులు	99599 94646
తూరంగి	జి.శ్రీనివాసరావు	77022 99660	జేవీ రమణమ్మ	99516 72981
గంగనాపల్లి	గీసాల మహాలక్ష్మి	91606 99909	కర్రి శ్రీనివాసరావు	99495 63418
కొవ్వాడ	కోటిపల్లి ఉమ	99660 97456	జి.చిరంజీవి	99127 77608
కొవ్వూరు	పిల్లి చక్రరావు	98483 98161	ముత్యాల వరలక్ష్మి	98496 52455
నేమాం	రామదేవు సూర్యప్రకాశరావు	97053 89099	ఎల్‌వీఎల్ దేవి	99086 74433
పండూరు	వలవల అమ్మాజీ	98487 54599	ఎం.రామమోహన్‌చౌదరి	93918 30892
పి.వెంకటాపురం	పెంకే లక్ష్మి	99089 09820	ఎండీ స్వస్థల షరీఫ్	89770 61120
పెనుమర్తి	పెంకే ఆనందకుమార్	78935 76090	చిక్కాల వెంకటరమణ	79931 12114
రేపూరు	నక్కా వీరన్న	99482 91614	కె.విజయ ఝాన్సీ	83175 22877
సర్పవరం	శీలం నాగేశ్వరరావు	98487 43953	పి.శ్రీనివాస్	98666 89968
సూర్యారావుపేట	సూరాడ చిన్నీ	99126 71919	ఎల్‌వీఎల్ దేవి	63035 74042
తమ్మవరం	గొల్లపల్లి రామస్వామి	98499 98334	బి.రాజేంద్రకుమార్	80088 15021
తిమ్మాపురం	బీవీవీ సత్యనారాయణ	98484 43334	ఎస్.నాగఫణిబాబు	99086 74433

కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరే రైళ్లు

ట్రైన్ నం.	స్టేషన్	గమ్య స్థానం	వెళ్లే సమయం	వచ్చే సమయం
17258	కాకినాడ పోర్టు	విజయవాడ (డైలీ మెము)	04.20	23.03
17267	కాకినాడ పోర్టు	విశాఖపట్నం (డైలీ మెము)	04.45	21.28
12755	కాకినాడ పోర్టు	భావనగర్ (భావనగర్)గురు	05.50	16.48
17206	కాకినాడ పోర్టు	సాయినగర్ (షిర్డీ) సోమ, బుధ, శని	06.10	18.55
17221	కాకినాడ పోర్టు	లోకమాన్య తిలక్ (ఎల్‌టీటీ) బుధ, శని	09.10	13.43
17655	కాకినాడ పోర్టు	పుదుచ్చేరి (సర్కార్) ఆది, బుధ, గురు	14.40	09.10
17644	కాకినాడ టౌన్	చెంగల్‌పట్టు (సర్కార్) సోమ, మంగళ, శుక్ర, శని	14.40	09.10
17250	కాకినాడ టౌన్	తిరుపతి డైలీ	15.15	11.45
17210	కాకినాడ టౌన్	బెంగళూరు (శేషాద్రి) డైలీ	17.25	06.45
12737	కాకినాడ పోర్టు	లింగంపల్లి (గౌతమి) డైలీ	19.20	06.58
07445	కాకినాడ టౌన్	లింగంపల్లి (స్పెషల్)సోమ బుధ, శుక్ర	20.10	07.10

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

పిఠాపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్లు బోధించడానికి అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుభాషిణి గురువారం తెలిపారు. కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులుగా దరఖాస్తు చేసుకునే వారు ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్, లేదా ఎంటెక్ కంప్యూటర్స్, ఎంసీఏ 55 శాతం మార్కులతో ఏదైనా అర్హత కలిగి ఉండాలన్నారు. కంప్యూటర్ అప్లికేషన్స్ బోధనకు దరఖాస్తు చేసుకునే వారు ఎంసీఏ, ఎంటెక్ కంప్యూటర్స్‌లో 55 శాతం మార్కులతో ఏదైనా అర్హత కలిగి ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 17వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు తమ దరఖాస్తులను ప్రభుత్వ డిగ్రీ కళాశాల కార్యాలయంలో అందజేయాలన్నారు.

కనకదుర్గమ్మకు ఘనంగా చండీహోమం



చండీహోమంలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి తొలిపావంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారికి జన్మనక్షత్రం మూల సందర్భంగా గురువారం చండీహోమం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఐదుగురు భక్తులు చండీహోమంలో పాల్గొన్నారు.